www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 సెప్టెంబర్ 2025
5
వైఎస్ఆర్





వ్య.కా.స అఖిలభారత సమావేశాలకు కడపకు విచ్చేసిన కేరళ ఎంపీ శివదాసన్‌కు, కేరళ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ చంద్రన్‌కు స్వాగతం పలుకుతున్న సిపిఎం జిల్లా నాయకులు

కడప నగరం..అరుణమయం

నేటి నుంచి కడపలో
వ్య.కా. స జాతీయ సమావేశాలు
నేడు ర్యాలీ, బహిరంగసభ
22 రాష్ట్రాలకు చెందిన
వ్యవసాయ కార్మిక సంఘం
నాయకులు హాజరు



అంబేద్కర్ సర్కిల్ వద్ద కట్టిన తోరణాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈమేరకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్న జాతీయ సమావేశాల షెడ్యూల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులోభాగంగా కడప నగరంలోని ప్రధాన కూడళ్లు అయిన సెవన్‌రోడ్స్, కోటిరెడ్డి, అంబేద్కర్ సర్కిళ్లు, రహదారులలలో ఎర్రజెండాలు, తోరణాలతో అరుణమయం చేసింది. కడపలో తొలిసారిగా నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలకు దేశంలోని 22 రాష్ట్రాలకు చెందిన 200 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. ముఖ్య అతిథులుగా కేరళ లెఫ్ట్‌ఫ్రంట్ నాయకులు మాజీ ఎంపీ విజయ రాఘవన్, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ నాయకులు విక్రమ్‌సింగ్, విజూ కృష్ణన్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జాతీయ కన్వీనర్ లలితాబాలన్, వ్యవసాయ కార్మిక సంఘం కేరళ బోర్డు చైర్మన్ చంద్రన్ హాజరు కానున్నారు. అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్‌శివనాగరాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కా.బి.



తోరణాలు కడుతున్న నాయకులు

మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శివి.అన్వేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ హాజరు కానున్నారు. జాతీయ సమావేశాల నిర్వహణలో భాగంగా మొదటి రోజు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఆర్‌టిసి బస్టాండు నుంచి పాతబస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనుంది. 11 గంటలకు పాతబస్టాండ్ ఆవరణంలో బహిరంగసభ నిర్వహించనుంది. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు హరిత హోటల్‌లో దేశ వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన మహిళలతో దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చాగోష్టి నిర్వహించనున్నారు. రెండవ రోజు మంగళవారం ఉదయం 10 గంటలకు కేరళ లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీ విజయరాఘవన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ శివదాసన్, జాతీయ సమావేశాలను ప్రారంభించనున్నారు. అనంతరం 11.30 గంటల వరకు సమావేశాలకు హాజరైన ప్రముఖుల పరిచయం, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ప్రసంగించనున్నారు. అనంతరం జాతీయ సమావేశాలు ప్రారంభం, ఎఐఎడబ్ల్యుయూ జాతీయ కార్యదర్శి బి.వెంకట్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టనున్నా రు. మూడవ రోజు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సమావేశాలకు హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అనుభవాలను పంచుకోనున్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, డాక్టర్లు, మధ్యతరగతి ఉద్యోగులు, వామపక్ష అభిమానులు, ఇతర ప్రముఖులతో సెమినార్ నిర్వహణతో ముగియనుంది.



అరుణ తోరణాలతో ముస్తామైన కోటిరెడ్డి సర్కిల్



ఏర్పాట్లలో వ్య.కా.స సభ్యులు

టిడ్కో పనులను వేగవంతం చేస్తాం

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.బలరామయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

టిడ్కో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేశాం. కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మ లమడుగు, రాయచోటి, మదనపల్లి పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడమైంది. 300 స్వేర్‌ఫీట్, 365 స్వేర్‌ఫీట్, 430 స్వేర్‌ఫీట్ చొప్పున మూడు కేటగి రీలుగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టాం. కడప నగర పరిధిలోని ఎస్టేట్ లోని 1,584 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశాం. రోడ్లు, తాగునీరు, డ్రైయినేజీ వంటి మౌలిక వసతులను కల్పించడమే ఆలస్యం. దీనిపై సంబంధిత కాంట్రాక్టు సంస్థలపై సంప్రదించడమైంది. కాంట్రాక్టు సంస్థల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడం జరుగుతుంది. అనంతరం లబ్ధిదారులకు టిడ్కోగృహాలను అందజే స్తారు. పేర్కొంటున్న టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.బలరామయ్యతో ముఖాముఖి...

టిడ్కో ఇళ్ల పురోగతి ఎలా ఉంది?

ఉమ్మడి కడప జిల్లాలో కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడమైంది. ఇందులో కడప పట్టణ పరిధిలోని ఎస్టేట్, చలమారెడ్డిపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. చిన్నచౌక్ పరిధిలోని ఎస్టేట్ ప్రాంతంలో 1,584 ఇళ్లు, చలమారెడ్డి పల్లి ప్రాంతంలోని 1,440 ఇళ్లలో 992 ఇళ్లను పూర్తి చేశారు.

టిడ్కో ఇళ్ల వివరాలు తెలపండి?

ఉమ్మడి కడప జిల్లాలోని కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడమైంది. ఇందులో కడపలోని చలమారెడ్డిపల్లిలో 1440, ఎస్టే ట్‌లో 144, యర్రగుంట్లలో 1440, జమ్మలమడుగులో 1440, ప్రొద్దుటూరులో 144, రాయచోటిలో 240 వెరసి 4,848 ఇళ్ల నిర్మా ణాలను చేపట్టడమైంది. ఇందులో 2,226 ఇళ్లను పూర్తి చేయడమైంది.

రిజిస్ట్రేషన్ల పట్ల స్పందన ఎలా ఉంది?

ఉమ్మడి కడప జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని 144 ఇళ్లు మినహా కడప, యర్రగుంట్ల, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లోని 300, 365, 430 కేటగిరీల ఇళ్లకు రిజి స్ట్రేషన్లు పూర్తి చేయడమైంది. ఇందులో 300 స్వేర్‌ఫీట్ పరిమాణం కలిగిన ఇళ్లకు ఒక్క రూపాయితోనే రిజిస్ట్రేషన్ చేయడమైంది. మిగి లిన రెండు రకాల ఇళ్ల లబ్ధిదారులు రూ.25 వేల చొప్పున లబ్ధి దారుని వాటా కింద చెల్లించడమైంది.

మౌలిక వసతుల గురించి చెప్పండి?

జటిడ్కో ఇళ్ల పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది. తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్, ఎస్‌టిపి సరఫరా వంటి సమస్యలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో డ్రెయి నేజీ నిర్మాణ పనులు ప్రధానం. 75 శాతంపైగా ఎస్‌టిపి నిర్మాణాన్ని పూర్తి చేయడమైంది.

కాంట్రాక్టు సంస్థల మందగమనానికి కారణమేమిటి?

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్ల పనుల్ని వేగవంతం చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఎన్‌సిసి, దాస్, డిఇసి, ఎంఎస్‌ఆర్, ఇన్‌ఫ్రా కాంట్రాక్టు సంస్థల కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఇన్‌ఫ్రా కాంట్రాక్టు సంస్థలు అందుబాటులోకి వచ్చిన వెంటనే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తాం.

10న 'విద్యా, ప్రజారోగ్యం'పై సెమినార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 10న నిర్వహించే సెమినార్ జయప్రదయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పెన్షనర్స్ జిల్లా కార్యాలయంలో సెమినార్ కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవన్‌లో సాయంత్రం ఐదున్నర గంటలకు 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు – ప్రభుత్వ రంగ సంస్థలు విద్యా ప్రజారోగ్యం రంగాలపై ప్రభావం' అనే అంశం మీద సెమినార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధానవక్తగా ఎంపీ రాజ్యసభ ఆర్.శివదాసన్ హాజరవుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగాలపై విద్యాప్రజారోగ్యాలపై వ్యవహరిస్తున్న తీరును ప్రజా రంగాలు, సంఘాలు ఎదుర్కోవలసిన విషయాలపై వివరిస్తారని పేర్కొన్నారు. ఎల్‌ఐసి నాయకులు రఘునాథ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జెవివి రాష్ట్ర కోశాధికారి బి.రాజశేఖర్ రాహుల్, యు ఈఈయు రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ఏపీ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర నాయకులు కె. జగదీశ్వర్ రెడ్డి, ఎల్‌ఐసి పెన్షనర్ నాయకులు కె.సుధాకర్, ఏపీజీబీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యక్షుడు నాగ ముని రెడ్డి, యుటిఎఫ్ నాయకులు సుజాత, వెంకటేశ్వర రెడ్డి, నాయకులు నగేష్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

బాలోత్సవంలో సభ్యులుగా చేరాలని జిల్లా అధ్యక్షులు గుర్రాల గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న విశ్వేశ్వరయ్య భవన్లో బాలోత్సవం నిర్వహణపై నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీల సభ్యులను పెంచే ఉద్దేశంతో సభ్యత్వం ప్రారంభిస్తున్నామని తెలిపారు. 3వ బాలోత్సవం నిర్వహించాల్సి ఉందని దానికి అందరం కలిసి పని చేద్దామని చెప్పారు. గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి మాట్లాడుతూ అన్ని మండలాల నుంచి బాలలంటే ప్రేమ, అభిమానం, సేవాభావం కలవారు, పిల్లలు వత్తిడి లేని చదువులు కొనసాగించుటకు, కో – కరికులర్ యాక్టివిటీస్ నిర్వహించడం, జ్ఞానాన్ని పెంచడం, మానసికంగా ఎదిగేందుకు, మానవత్వం పెంపొందడానికి కృషి చేయాలనుకునే మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మహిళలు, విలేకరులు సభ్యులుగా చేర్చుకుని కార్యక్రమాలను పెంచుతామన్నారు. ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ మన జిల్లాలో 3వ బాలోత్సవం (పిల్లల పండుగ) నవంబర్ చివర్లో లేక డిసెంబర్ మొదట్లో కాని నిర్వహిస్తామన్నారు. పిల్లల కోసం పని చేయాలనుకొనే వారు బాలోత్సవంలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో బాలోత్సవ నాయకులు ప్రొఫెసర్ మృత్యుంజయ రావు, వెంకట సుబ్బయ్య, లక్ష్మి రాజ, సునీత, అరుణ, సుందరయ్య యల్.ఐ.సి.నాయకులు, రఘునాథరెడ్డి, మహిళలు సరస్వతి, కరస్పాండెంట్ లలిత బాయి, సుజాత రాణి, సిరి కల్చర్ వెంకట్రామరాజు, పెన్షనర్ నాయకులు రామకృష్ణ రెడ్డి, బ్యాంక్ నాయకులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీలో నిబద్ధత గల నేతకు రాష్ట్ర డైరెక్టర్ పదవి లభించడం అభినందనీయమని టిడిపి నేతలు పేర్కొన్నారు. ఆదివారం 3వ డివిజన్‌కు చెందిన టిడిపి నేత వెంకటసుబ్బయ్యకు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పదవి రావడంతో ఆయన్ను కలిసి టిడిపి నేతలు శాలువా, పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతు ఎన్నో సంవత్సరాల నుంచి క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధికి, విజయానికి వెంకట సుబ్బయ్య కృషి చేశారని చెప్పారు. వెంకట సుబ్బయ్యకు పదవి రావడానికి కృషి చేసిన శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటసుబ్బయ్య డైరెక్టర్ పదవికి వన్నె తేవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కొమ్మలపాటి చక్రి, రాయుడు, ఖాజాపీర్, జనార్దన్, రామాంజి, హనుమంతు, రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బృందం సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు ఆదర్శవంతవంతమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్ట్ న్యాయవాది మదిరే రంగసాయి రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీహరి డిగ్రీ కళాశాలలో సంకల్ప వేదిక విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక విశిష్ట సేవా కార్యక్రమాలలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందంచే 16 ఏళ్లుగా చేపడుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల కొరకు ఉచిత కోచింగ్‌లు, పలు విద్యా పరమైన సేవలు అమోఘమని పేర్కొన్నారు. దాదాపు ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో విధులు నిర్వహిస్తున్న 39 మంది ఉపాధ్యాయ, అధ్యాపక బృందం ఒకే వేదిక పై స్వచ్ఛందంగా సేవలు అందించడం ఆదర్శవంతమైనవని తెలిపారు.

అన్ని నొప్పలకు ఉపశమనం ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - కడప అర్బన్



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్‌శివానాయక్

అన్ని నొప్పులకు ఉపశమనం ఫిజియోథెరపీ అని ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ శివా నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎటువంటి వయసుకు సంబంధం లేకుండా అన్ని రకాల నొప్పులు శరీరంలో వస్తూఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎక్కువ బిపి, షుగర్ ఉన్న వారికి సహజ సిద్ధంగా అదుపులో లేనప్పుడు పక్షవాతం, ముఖ పక్షవాతం, కాళ్లు చేతులు పూర్తిగా పడిపోవటం, దీర్ఘకాలికంగా తలనొప్పి, మెడ నొప్పి, భూజాల నొప్పులు, నడుం, మోకాళ్ళ నొప్పులు, వంటి జబ్బులు వస్తాయని, దానికి ఏకైక వైద్యం ఫిజియోథెరపీ అన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ (మైలవరం)



చెన్నప్ప మృతదేహం

మైలవరం మండలం దన్నవాడ గ్రామానికి చెందిన మద్దిరాల చెన్నప్ప (52)అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని బంధువుల వివరాల మేరకు. మృతుడు మూడేళ్ల నుంచి పంటలో సరైన దిగుబడి రాకపోవడం, వచ్చినా వాటికి గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల నష్టాలపాయ్యారు. దీనికి తోడూ చేసిన అప్పులు విపరీతంగా పెరిగాయి. శనివారం సాయంత్రం ఆయన ఇంటికి వెల్లిపోయారు. ఎంతకూ కన్పించకపోవడంతో బంధువులు చుట్టుపక్కల ప్రదేశాలలో వెతికారు. ఆదివారం ఉదయాన్నే పొలం వద్ద గల రాళ్లగుట్టలలో పురుగుల మందు తాగి చనిపోయి ఉండడానికి గమనించారు. వెంటనే బంధువులు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మయ్య సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బంధువులు అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. విషయం తెలుసుకున్న మైలవరం మండలం మహిళ నాయకురాలు దన్నవాడ అల్లె ప్రభావతమ్మ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చెన్నప్ప మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రజకులపై దాడి హేయం


ప్రజాశక్తి - కడప: శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో రజకులపై పెత్తందారులు దాడి చేయడం హేయనీయమని, వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని అని కడప జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షులు రవి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక కడప బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో రజక నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలో రవి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలలో చోటు చేసుకున్న చిన్న సంఘటన దృష్టిలో పెట్టుకొని ఆ గ్రామంలోని పెత్తందారులు మారణ ఆయుధాలతో రజక కుటుంబంపై దాడి చేసి హరేమ్మ మహిళను హత్య చేసి మిగతా ఆరుగురు కుటుంబ సభ్యులపై విచక్షణ రహితంగా దాడిచేసి తీవ్ర గాయాలు పాలు చేసిన వారిని శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తూ ఆ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలిండియా నాతీయ ముషాయిరా

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగరంలోని మీలాద్ కమిటీ కార్యాలయంలో పవిత్రమైన మీలాదున్ నబీ మాస ఉత్సవాలను పురస్కరించుకుని మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆల్ ఇండియా నాతియా ముషాయిరా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ కవులు రాయలసీమ, పలు రాష్ట్రాల నుంచి హాఇజరయ్యారు. ఈ సందర్భంగా నాతీయ ముషాయిరా ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మీలాద్ కమిటీ ప్రెసిడెంట్ హాజీ మొహమ్మద్ అహ్మదుల్లా, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సెక్రెటరీ షేక్.నయీముద్దీన్, కమిటీ సభ్యులు, ముస్లిం ప్రముఖులు, స్థానిక కవులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని పంచుకోవడానికే పి4

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ ఆస్తులను ప్రజా ధనాన్ని పాలకులు పంచుకోవడమే పి4 అని వైసిపి మెడికల్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వై.ఎఊస్. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కనివిని ఎరుగని రీతిలో విద్య, వైద్యం, వైద్య విద్యలో మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పార్టీ కోసం సంపద సృష్టించుకునేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేబినెట్ సమావేశంలో ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కూడా ప్రయివేటీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం మరి దారుణం అన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీకోదండరామయ్య కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలో పౌర్ణమి సందర్భంగా శ్రీ కోదండరాముడి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఇందులో పుణ్యాహవచనం నిర్వ హించారు. ఆ తరువాత రక్షాబంధనం, యజ్ఞోప వీతధారణ, వరప్రేశనం(కన్యావరణం), మధుపర్కార్చనం చేశారు. మహా సంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్నిప్రతిష్టాపన తరువాత సీతా రాముల తల మీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక నిర్వహించారు. తరువాత మంగళాష్టకం, చూర్ణిక పఠించి, మాంగళ్యసూత్ర పూజ, మంగళసూత్రధారణ, అక్షతారోపణం చేపట్టారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణఘట్టం పూర్తయింది. అంతకుముందు ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ ఎ. నవీన్ కుమార్, అర్చకులు, విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వీర నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి - కడప : కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతు శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ ఇండియన్ జులాజికల్ వెల్ఫేర్ సొసైటీ, లకో కు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైనటువంటి యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూట్ నుంచి మొత్తం 16 మంది ఎన్నికయ్యారు. అందులో డిగ్రీ కళాశాలల నుంచి డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ ఎన్నిక అవడం చాలా గర్వకారమని ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. అనంతరం ఆయన్ను ప్రిన్సిపల్ తోపాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అకాడమిక్ కో – ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ నాగేశ్వర రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ నీలయ్య, డాక్టర్ రవి శేఖర్, విద్యార్థులు అభినందించారు.

మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణం

ప్రజాశక్తి - కడప

మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దారుణమని మాజీ డిప్యూటీ సిఎం బాషా అన్నారు. ఆదివారం తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడాన్ని వైసిపి ఖండిస్తుంది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలను మోసం చేస్తూనే ఉందన్నారు.వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి రిమ్స్ నిర్మించారు అన్నారు. తర్వాత వై.ఎస్ జగన్ ప్రతి జిల్లాల్లో ఒక్కో మెడికల్ కళాశాలలను నిర్మించారని తెలిపారు. పులివెందుల మెడికల్ కళాశాలలో కటాయి ంచిన 50 సీట్లను కూడా వెనక్కి ఇచ్చిందన్నారు.పేద ప్రజలంటే చంద్రబాబుకు అలుసా? అని ప్రశ్నించారు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తే ప్రయివేటీకరణను రద్దు చేస్తామన్నారు.

ఆచార్య కృష్ణారావు అభినందనీయులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : తన కష్టాన్ని నమ్ముకుని, నిరంతరం శ్రమించి విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయికి ఎదిగిన కె.ఎస్.వి. కృష్ణారావు అభినందనీయులని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సందర్భంగా వైఎస్‌ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేమన నగర్ రచయితల సంఘం కార్యాలయంలో కృష్ణారావును ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పట్టవా? : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టవా అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ అధ్యక్షతన ఆ సంఘ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తి అవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించకపోవడం తగదన్నారు. ఎన్నికలకు ముందు కల్లి బొల్లి కబుర్లు చెప్పి ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వస్తున్న పాలకవర్గాలు తీరా అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. గత పాలకుల విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు ఇస్తామని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటిని రోడ్ మ్యాప్ ప్రకటించి ఏడాదిలోగా చెల్లిస్తామని ప్రకటించిన కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను మరచిపోయినట్లు వ్యవహరి స్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అధికారంలోకి రాక మునుపు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడమే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. ఇప్పటికే ప్రాథమిక విద్యను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు.

కుక్కల బెడద తప్పించరూ..!

బెంబేలెత్తుతున్న పిల్లలు, మహిళలు, వృద్ధులు-జిల్లాలో 32 నెలల్లో 14,376 మందికి కుక్క కాట్లు, జీవాలు మృత్యువాత



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మొరిగే కుక్క కరవదంటారు. కానీ ఇప్పుడు మొరగని కుక్కలే కాదు.. మొరిగే కుక్కలు సైతం పిక్కలు పట్టుకుని పీకుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిత్యం ప్రజలను కుక్కలు వెంటపడి కరుస్తున్నాయి. ఇటీవల కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో నిత్యం ఏదొక గ్రామంలో శునకాల దాడులు జరుగుతూనే ఉన్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు చివరకు మూగజీవాలు కూడా వాటి బారిన పడుతున్నాయి. వీధి కుక్కల దాడిలో మూగజీవాలు వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే కుక్కలు కాటు వేసిన తర్వాత అందించే వైద్యం మరో ఎత్తు. కుక్కలు కరిచినప్పుడు సకాలంలో వైద్యం అందించక పోతే బాధితులు రేబిస్ వ్యాధి బారిన పడి ప్రాణాలు పోయే పరిస్థితి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా వైద్యశాలలు, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ వైద్యశాలలో వ్యాక్సినేషన్స్ అందుబాటులో ఉన్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నివేదికల ప్రకారం జిల్లలో గత రెండేళ్ల 8 నెలల కాలంలో 14,376 మంది కుక్క కాటుకు గురై తీవ్ర రక్త స్రావంతో వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ వేయించుకున్నారు. 2023లో 5,485 మంది, 2024లో 5,549 మంది, 2025 ఆగస్టు 17 వరకు 3,342 మంది కుక్క కాటుకు గురయ్యారు. ఇళ్లల్లో పెంచుకొనే పెట్ డాగ్స్ వల్ల నెలకు 200 మంది వరకు కుక్కకాటుకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. కుక్కకాటుతో మర ణాలు సంబవించ లేదు. అయితే ర్యాబిస్ వ్యాధి బారిన పడిన వారు ఇద్దరూ మృతి చెందారు. 2023లో పులివెందులలో ఒకరు, 2024లో కడపలో ఒకరు మృతి చెందారు. ఈ ఏడాది మే, జూన్, జూలై నెలలో బద్వేలు పట్టణంలో కుక్కల దాడిలో 39 మంది గాయపడిన సంఘటన సంచలనం. ఆగస్టు 7న తొం డూరు మండలంలోని కోరవానిపల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో కొప్పల రామమోహన్‌కు చెందిన 22 మేక పిల్లలు, గొర్రెలు మృతి చెందాయి. పత్రికల్లో ఈ విషయం తెలుసుకున్న సెంట్రల్ మీడియా స్కానర్ వారు నివేదిక పంపాలని జిల్లా వైద్య అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు బద్వేలులో విచారించి ఆ మేరకు నివేదిక సమర్పించారు. అక్కడ వ్యాక్సినేషన్ అందుబాటులో ఉన్నాయా లేదా, వ్యాక్సినేషన్ చేయించారా లేదా, కుక్కకాటుకు గురైన వారు చికిత్సలు పొందారా లేదా విచారించి ఆ మేరకు నివేదికను పంపారు. పట్ట ణాలలో రాత్రి సమయాల్లో రోడ్లపై ఆటో దిగి ఇంటికి నడుచుకుని వెళితే ఖచ్చి తంగా కుక్కల బారిన పడి తీరాల్సిందే. ఇలాంటి సంఘటనలు నిత్యం జిల్లాలో జరుగు తూనే ఉన్నాయి. కడప, ప్రొద్దుటూరు, రాజం పేట, బద్వేలు, రాయచోటి, జమ్మల మడుగు, పులివెందుల పట్టణాల్లో వీధి కుక్కలతోపాటు పిచ్చి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పాద చారులు, ద్వి చక్రవాహనదారులను అవి వదలడంలేదు. కుక్కల బెడద నివారిం చండి మహాప్రభో అని ప్రజలు పలు మార్లు మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నా వారిలో ఏ మాత్రం చలనం లేదు. గతంలో కుక్కలను పట్టుకుని వెళ్లే బాధ్యతను ప్రత్యేకంగా సంచార తెగవారికి ఇచ్చేవారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు ఆ దిశగా ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. శునకాల సంతతి, నియంత్రణకు జిల్లా ఉన్నతాధికారులు, పురపాలక సంఘాల కమిషనర్లు, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో కమిటీ ప్రతి నెల సమావేశమై చర్చించాల్సి ఉన్నా.. ఆ దిశగా కనిపించడంలేదు.



బద్వేల్‌లో కుక్క దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్‌ఫొటో)



తొండూరు మండలం కోరవానిపల్లిలో కుక్కల దాడిలో చనిపోయిన జీవాలు (ఫైల్‌ఫొటో)

కుక్కకాటుకు జాగ్రత్తలు తీసుకోవాలి..

కుక్కకాటుకు గురైన 24 గంటలలోపు వైద్య సహాయం పొందాలి. కుక్కకాటుకు గురైన వెంటనే యాంటీ రేబిస్ ఇంజెక్షన్ తీసుకోవాలి. పిచ్చికుక్క కాటుకు గురైనట్లయితే ఇమ్యునోగ్లోబిన్స్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. కుక్కకాటుకు సంబంధించి అవసరమైన అన్ని ఇంజెక్షన్లు అన్ని ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాలి.

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది..

కుక్కకాటు బారిన పడిన వారికి జిల్లా, తాలుకా మండల పరిధిలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. వ్యాక్సిన్స్ ఉచితంగా వేస్తారు. కుక్క కాటుకు గురైన వెంటనే వ్యాక్సిన్ వేసుకొంటే ఎలాంటి ప్రమాదం ఉండదు. నిర్లక్ష్యం చేస్తే ర్యాబిస్ వ్యాధి బారిన పడవచ్చు.

- నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి..

ఎస్‌బిఐ కాలనీ, మారుతి బజార్, శ్రీరామ హాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు, మహిళలు హడలిపోతున్నారు. కుక్కలు గుంపులుగా ఉండ డంతో బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది కుక్కల బెడదను నివారించాలి.

- గోపాల్‌రెడ్డి, స్థానికుడు, పులివెందుల



వెలుగుతున్న వీధి దీపాలు

ఎల్ఎమ్ కాంపౌండ్‌లో వెలిగిన వీధి దీపాలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎల్ఎమ్ కాంపౌండ్‌లో వీధి దీపీలు వెలిగాయి. 'అంధకారంలో ఎల్ఎమ్ కాంపౌండ్ వాసులు' అనే శీర్షికన ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మరమ్మతులు చేపట్టి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మల్లోత్రాకు సన్మానం

ప్రజాశక్తి - దువ్వూరు

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియ మితులైన జనసేన మైదుకూరు నియోజ కవర్గ అధ్యక్షులు పి.మల్లోత్రాకు దువ్వూరు మండల టిడిపి నాయకుడు పెంచికలపాటి వెంకట సుబ్బయ్య నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లోత్రాను ఆయన ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వెంకటసుబ్బయ్య ఆకాంక్షించారు.



మల్లోత్రాను సన్మానించిన వెంకటసుబ్బయ్య నాయుడు

నాణ్యమైన వైద్య విద్య కోసమే పిపిపి విధానం

ప్రజాశక్తి - చాపాడు

నాణ్యమైన వైద్య విద్య కోసమే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల పిపిపి విధానం అమలులోకి తీసుకొచ్చిందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించి అమలులో విఫలమయ్యారని విమర్శించారు. 17 కాలేజీల అంచనా మొత్తం రూ.8,480 కోట్లు కాగా 4 ఏళ్లలో మీరు ఖర్చుపెట్టిన మొత్తం రూ.2,125 కోట్లు మాత్రమే అన్నారు. ఈ కాలేజీలు పూర్తి కావాలంటే ఇంకా రూ.6,300 కోట్లు కావాలన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. యువతలో వైద్య విద్య కోసం వేలాది మంది రష్యా, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలకి వెళ్లి ఇండియాకు వచ్చి మళ్ళీ ఎఫ్ఎమ్‌జీ పరీక్షలో కేవలం 20 నుంచి 25 పర్సెంట్ మాత్రమే పాస్ అవుతున్నారన్నారు. ఈ పరిస్థితులు గమనించి ముఖ్యమంత్రి నాణ్యమైన విద్య విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితుల్లో అందించాలంటే పిపిపి విధానమే సరైన మార్గమని నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్ అనుభవంలేని పరిపాలన వల్ల రాష్ట్రం సర్వనా శనమైందన్నారు. ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆయన సూచించారు.



టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి

జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన జిలాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతమయ్యాయి. అండర్-18, -20 స్త్రీ పురుషులకు జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుండి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 100మీ, 200మీ, 400మీ, ఎనిమిది వందల మీ, లాంగ్‌జంప్ జావెలిన్ త్రో ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ క్రీడలలో రాష్ట్రస్థాయి పోటీలకు 20 మంది క్రీడాకారులు ఎంపిక య్యారు. వీరు ఈ నెల 26,27,28 తేదీల్లో ఏలూరులో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా తరపున ప్రాతినిధ్య వహిస్తారు. ఈ క్రీడల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు శివారెడ్డి, రాఘవ, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, హసీనా, లక్ష్మి, అద్భుత కుమార్, గిరి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని, రఫీ సహకరించారు. వీరందరికీ నిర్వాహకులు, ఫౌండేషన్ కార్యదర్శి అమర్‌బాషా, జిల్లా అథ్లెటిక్ సంఘం ధన్యవాదాలు తెలిపారు.



షార్ట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి

చీనీ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

చీనీ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి కోరారు. గిట్టుబాటు ధర లేకపోవడంతోపాటు కొనే వారులేక రైతులు లబోదిబో మంటున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన చీనీ తోటలను ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఈడ్చని సేద్యం బాగుపడవని తెలిపారు. వ్యవసాయం పండుగ కావాలి అన్నారు. దుంధృష్టవశాత్తూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో రైతు ఏడుస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం దండుగ అనే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. పంట పండించడం ఒక ఎత్తు అయితే, దాన్ని అమ్ముకోవడం రైతులకు మరో ఎత్తు అయ్యిందని తెలిపారు. చంద్రబాబు పాలనలో చీనీ, మామిడి, ఉల్లి, పొగాకు, మిరప, టమోటా ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడంలేదని తెలిపారు. టన్ను చీనీ కాయలను కనీసం రూ.40 వేల నుంచి రూ. 50 వేలకు కొంటే గాని రైతుకు గిట్టుబాటు ఉండదని చెప్పారు. కూలి కూడా రాదనే ఉద్దేశంతో చీనీ కాయలను అలాగే చెట్టుకు వదిలేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు కన్న బిడ్డల్లా కాపాడుకున్న చీనీ చెట్లను నిలువునా నరికేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే రైతుల వద్ద నుండి టన్ను రూ50 వేల చొప్పున చీనీ కాయలను కొనాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. పులివెందుల నియోజకవర్గంలో శీతల గిడ్డంగి, ఫుడ్ ప్రాసెసింగ్ కర్మాగారాన్ని నెలకొల్పాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె, చక్రాయపేట, మండలశాఖ అధ్యక్షులు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, కాంగ్రెస్ నేతలు బద్రి, ఉత్తన్న, వేమయ్య, రమణ, ఫయాజ్, రైతులు సంజీవరెడ్డి, లక్ష్మిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, గంగా మహేష్ పాల్గొన్నారు.



కటింగ్ చేస్తున్న చీనీ కాయలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలతో తులసిరెడ్డి

లిఫ్ట్ స్కీమ్‌లు జిఎన్ఎస్ఎస్‌కు బదలాయింపు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కొండాపురం సమీపంలోని గండికోట రిజర్వాయర్ నుంచి పార్న పల్లె చిత్రావతికి రిజర్వాయర్‌కు విడు దల చేసే ఐదు లిఫ్ట్‌లను గండికోట లిఫ్ట్ ఇరిగేషన్‌కు జల వనరుల శాఖ ఉన్నతా ధికారులు బదలాయింపు చేశారు. ప్రారంభంలో జికెఎల్‌ఐ పరిధిలో ఉన్నప్పటికీ అనంతరం సాంకేతిక కారణాల దృష్ట్యా ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు పోరుమామిళకు బదిలీ చేశారు. తిరిగి ఇటీవల గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ పులివెందుల కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో పులివెందుల జికెఎల్‌ఐ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలో నుంచి నీటి సరఫరాకు సంబంధించి పర్యవేక్షణ చేయనున్నారు.



చిత్రావతి లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్

ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు..

ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు పోరుమామిళ్ల పరిధి నుంచి జికెఎల్‌ఐ పరిధిలోకి మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు తెలిపారు. పరిపాలన సౌలభ్యం, ఇతర సాంకేతిక కారణాల దృష్ట్యా బదలాయింపు చేశారని తెలిపారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

మొక్కల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి సూచించారు. చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఈద్గా మైదానంలో ఎమ్మెల్యే ఆదివారం 150 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల మనకు ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ప్రతి ఇంటిలో మొక్కలను పెంచాలన్నారు. అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షులు ముక్తియార్ మాట్లాడుతూ చెట్లను జాగ్రత్తగా పెంచి పోషించే బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. ఈద్గాలో 150 మొక్కలను జాగ్రత్తగా పెంచి మంచి వాతావరణాన్ని కల్పించడం మంచిదన్నారు. ప్రభుత్వం కూడా అందుకు సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి ఇలియాస్, ఉపాధ్యక్షులు మహమూద్, మాజీ అధ్యక్షులు బాషా, అంజుమన్ సభ్యులు ఖలీల్, నజీర్, మున్నా, ఖాదర్బాషా, షబ్బీర్, ఖాదర్ వలీ, అయూబ్, స్వచ్ఛంద సంస్థలు, స్వర్ణకారులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

దూదేకుల పొలిటికల్ జెఎసి జిల్లా కార్యదర్శిగా ఓతూరు సిద్ధు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా ముస్లిం దూదేకుల పొలిటికల్ జెఎసి కడప జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన ఓతూరు సిద్దును రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ దూదేకుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దూదేకులు రాజకీయంగా మరింత బలపడేలా అహర్నిశలు పాటు పడతానని పేర్కొన్నారు. దూదేకుల సమాజం రాజకీయ అవకాశాలు సాధించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిడాల పెద్దన్న, జిల్లా అధ్యక్షులు నాగూరు కుళ్లాయప్పకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



డిఎ, ఐఆర్‌పై ప్రకటన ఏదీ..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయినా ఇంతవరకు డిఎ, ఐఆర్‌పై ప్రకటన చేయలేదని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ ప్రశ్నించారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి లేదా మంత్రుల బృందంగాని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపలేదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు త్వరగా చెల్లించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి, ఆలోపు ఐఆర్ ప్రకటించాలని కోరారు. బదిలీ పొందిన స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 700 వరకు ఖాళీలున్నాయన్నారు. ఇందులో ఈ డిఎస్‌సి ద్వారా 235 పోస్టులు భర్తీ అవుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా సాంకేతిక కమిటీ కన్వీనర్ మహమ్మద్ గౌస్, రీజియన్ కో-కన్వీనర్ వెంకటేశ్వర్లు, మైలవరం మండల అధ్యక్షులు ఉపేంద్ర శివరాం, నాయకులు దామోదర రెడ్డి, గౌస్ నూర్, లక్షుమయ్య పాల్గొన్నారు.

వేంపల్లెకు శాపంగా వైసిపి, టిడిపి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ప్రజలకు వైసిపి, టిడిపి నేతలు శాపంగా మారారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం పాలకులు, అధికారుల అసమర్థతే కారణమన్నారు. ఆదాయం నిండుగా ఉన్న పంచాయితీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. వైసిపి పాలనలో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన ఎమ్మెల్సీ పంచాయతీ ఇంత దారుణంగా ఉంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అవినీతి జరిగిన నిధులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా పాలకులు స్పందించాలని కోరారు. వేంపల్లెలో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు గౌస్, ఖదీర్, సమీర్ పాలొగొన్నారు.



మాట్లాడుతున్న ఆప్ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.మనోహర్

వైర్ల దొంగతనాలను నివారించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మండలం బొమ్మేపల్లె, చుట్టుపక్కల గ్రామ పంచాయతీల్లో రైతుల కరెంటు వైర్లు తరుచూ చోరీకి గురవుతున్నాయని, వీటిని నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ కోరారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సామాన్య , పేద రైతులు పంటలు పండించుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి కరెంటు వైర్లను నిత్యం దొంగతనాలు చేయడం దుర్మార్గమన్నారు. దొంగతనాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, కమిటీ కార్యవర్గసభ్యులు విజయ్, వినయ్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన వైసిపి మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రైతుల సంక్షేమం కోసం మంగళవారం జరిగే అన్నదాత పోరుకు రైతులంగా కలిసి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ముల్లా జానీ, పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి, గొరిగనూరు సురేష్, దేవగుడి చంద్ర పాల్గొన్నారు.

రైతన్నకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

రైతులకు మద్దతుగా వైసిపి ఎరువులు బ్లాక్ మార్కెట్‌పై పోరాటం చేయాలని నిర్ణయించిందని, ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీకి పిలుపునిచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. రైతులందరూ సంఘటితమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని మొద్దు నిద్ర లేపాలంటే.. ముల్లు కర్రతో పొడవాల్సిందే అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటం అత్యంత అవసరమని పార్టీ భావించిందన్నారు. ఈ పోరాటంలో రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని రఘురామిరెడ్డి కోరారు.

నేటి నిరసన కార్యక్రమానికి తరలిరండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామ పంచాయితీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, సిబ్బందికి జీతాలు చెల్లించాలంటూ సోమవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రజలందరూ తరలి రావాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో వేంపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద గాంధేయ పద్ధతిలో సోమవారం ఉదయం10 గంటల నుంచి 11 వరకు నిరసన చేయనున్నట్లు తెలిపారు. ఆరు నెలలుగా వేంపల్లె పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక సిబ్బందికి జీతాలు చెల్లించలేదన్నారు. సిబ్బంది సమ్మెలోకి పోవడంతో వేంపల్లెలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఎక్కడ చూసిన మురికి కూపంగా తయారైందని తెలిపారు. కుక్కలు, పందులు, ఆవులు ప్రజల మధ్యనే సహజీవనం సాగిస్తున్నట్లు చెప్పారు.



షాపును ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రారెడ్డి

వినియోగదారుల మన్ననలు పొందాలి


ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వినియోగదారుల మన్ననలు పొంది వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆల్ఫా మెరైన్ సంస్థ చైర్మన్ సుధాకర్ సూచించారు. పులివెందుల శ్రీరామ హాల్ రోడ్డు సాయిబాబా స్కూల్ సమీపంలోని వెంకటసాయి కాంప్లెక్స్‌లో ఆదివారం ప్రాన్ బైట్ ఫ్రాంచెజ్ షాపును వారు ముఖ్యఅతిథులుగా ప్రారంభించారు. ఈ షాపును ప్రసాద్‌రెడ్డి, కృష్ణకాంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కస్టమర్లతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి మన్ననలు పొందాలన్నారు. అప్పుడే వ్యాపారం అంతకంత పెరుగుతుందన్నారు. ప్రొప్రైటర్స్ ప్రసాద్‌రెడ్డి, కృష్ణకాంత్ రెడ్డి మాట్లాడుతూ తమ షాపులో ప్రాన్ బటర్స్, ప్రాన్ సమోసా, ఫిష్ ఫింగర్స్, ప్రాన్ నగ్గేట్స్ వంటి పలు రకాల ఐటమ్స్ లభిస్తాయన్నారు. వివరాలకు 63049 12044 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో లాండ్రీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కంచర్ల ఆంజనేయులు ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాన్లు, వస్త్రాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఆంజనేయులు కుటుంబం కట్టు బట్టలతో వీధిన పడింది. సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే తీవ్ర నష్టం జరిగిపోయింది. ఆ కుటుంబం నిస్సహాయ స్థితిలోఉంది. దాతలు, మానవతా దృక్పథం ఉన్న వారు తమను ఆదుకోవాలని బాధిత ఆంజనేయులు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు, వస్తువులు